# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 09-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పర్యటిస్తారు.**
2. **తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో వరదనీరు మూసీనదిని చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
3. **సమాచారం, విద్య, వినోదాలతో కూడిన ప్రసారాలను ప్రజలకు అందించేందుకు ప్రసారభారతి కృషి చేస్తోందని ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది అన్నారు.**
4. **విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి అన్నారు.**
5. **తెలంగాణలో మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నట్లు ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.**

=========================

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా పాడేరు మండలంలోని వంజంగిలో దేవాలయ సందర్శన, ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగస్వామ్యం, కాఫీ తోటల్లో రైతులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో వరదనీరు మూసీ నదిని చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షం, తలెత్తిన ఇబ్బందులను అధిగమించేందుకు అనుసరించాల్సిన తక్షణ చర్యలపై అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎంత వర్షం పడినా గ్రేటర్ హైదరాబాద్‌లో నీరు నిల్వ ఉండకూడదని అధికారులకు సూచించారు. వందేళ్ల పాటు నగరంలో వరద సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే, మూసీ నది పునరుజ్జీవమే ముఖ్యమని ముఖ్యమంత్రి వివరించారు.

--------------------------

నిరంతరాయంగా సమాచారం, విద్య, వినోదాలతో కూడిన ప్రసారాలను ప్రజలకు అందించేందుకు ప్రసారభారతి కృషి చేస్తోందని ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది అన్నారు. ఢిల్లీలో వేవ్స్ ఓటిటి ప్లాట్‌ఫామ్‌లో మ్యాగజైన్ స్టోర్‌ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరవ్ ద్వివేది ఆకాశవాణితో మాట్లాడుతూ,

..వాయిస్ ..30 సెకన్లు

---------------------------

విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని సూచించారు. పేద విద్యార్థులు సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలని కోరారు.

---------------------------

తయారీ రంగంలో అనేక మార్పులు రాబోతున్నాయని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సంగారెడ్డి జిల్లా రుద్రారంలో ఓ కంపెనీకి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌగోళికంగా తెలంగాణ చిన్న రాష్ట్రమైనప్పటికీ ప్రణాళికల రూపకల్పన, అమలులో దేశంలోనే ముందు వరుసలో ఉన్నామని పేర్కొన్నారు. నమ్మకంతోనే కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంటున్నాయని మంత్రి వివరిస్తూ..

వాయిస్...25 సెకన్లు

---------------------------

తెలంగాణలో మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదశాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ - ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైన అనుమతులపై త్వరలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహిస్తారని మంత్రి తెలిపారు.

---------------------------

కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాహబ్‌గా తయారవుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 క్రికెట్ పోటీలను విశాఖపట్నం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిన్న రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ - ఏపీఎల్‌కు విశాఖపట్నం వేదిక కావడం ఆనందంగా ఉందని కేంద్రమంత్రి తెలుపుతూ..

వాయిస్....27 సెకన్లు

---------------------------

తెలంగాణలోని హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో బీసీ కేంద్రాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. యూనివర్సిటీ ఏర్పడి 60 ఏళ్లు అవుతున్నా ఇప్పటివరకు వెనకబడిన వర్గాల వారికి ఒక ప్రత్యేక కేంద్రం లేదని మంత్రి వెల్లడించారు. బీసీ కేంద్రం ఏర్పాటుతో బలహీన వర్గాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు.

--------------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు ఆర్థిక సాయం చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని శాసనసభ్యుని క్యాంపు కార్యాలయంలో నిన్న 16 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి – సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక స్తోమత లేని బాధిత కుటుంబసభ్యులకు ఏడాదిలో సీఎంఆర్ఎఫ్ ద్వారా 400 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు.

--------------------------------

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ఆదివాసీల వికాసానికి అవసరమైన సామాజిక హక్కులు కల్పించేందుకుగానూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తుండగా.. ఐక్యరాజ్యసమితి ప్రపంచ స్థానిక ప్రజల దినోత్సవంగా దీనిని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల్లో దాదాపు 5 వేల ఆదివాసీ తెగలుండగా.. 6 వేల700 భాషలు మాట్లాడుతున్న వీరి జనాభా 40 కోట్ల వరకు ఉంది. ఆదివాసీ తెగలు, భాషలు పలు కారణాలతో అంతరించిపోతున్న నేపథ్యంలో ఆదివాసుల సాంస్కృతిక జీవనాన్ని, వారి హక్కులను పరిరక్షించాలనే లక్ష్యంతో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

--------------------------------

పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, దీని ప్రభావంతో ఈనెల 13వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపడీనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ....

వాయిస్...20 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న మూడు రోజులపాటు ఉరుములు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=======================